# యువ వెలుగు

యువ వెలుగు - ప్రజల వెలుగు | PRGI:- TGTEL/26/A6429 | తెలుగు దిన పత్రిక

www.yuvavelugu.com | Epaper.yuvavelugu.com | yuvavelugu tv

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ఎడిటర్: పి.మహేష్ గౌడ్ సంపుటి : 1 సంచిక : 25 ఆదివారం, సెప్టెంబర్ 27, 2026, పేజీలు - 04 వెల: 2/-



యువ వెలుగు

తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

PRESS

మండలం | నియోజకవర్గం | జిల్లా

వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602


## పక్కాప్లాన్‌తో ప్రశాంతంగా గణపతుల

# నిమజ్జన ప్రక్రియ



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 :** గణనాథుల విగ్రహాల నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. నిమజ్జనం ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. మరో గంటలో నిమజ్జనం ప్రక్రియ పూర్తి అవుతోందని భావిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు తల్లి ఫ్లైఓవర్, బషీర్‌భాగ్ ఫ్లై ఓవర్లను ఇప్పటికే సామాన్య వాహనదారుల కోసం అందుబాటు లోకి తీసుకువచ్చామని వెల్లడించారు. అందువల్లే నిమజ్జన ప్రక్రియ ఆలస్యం.. ఈసారి టస్కర్లు, లారీలు అక్కడక్కడా బ్రేక్ డౌన్ అయ్యాయని సీపీ సజ్జనార్ వివరించారు. గణేశ్ విగ్రహాలు మండపాల నుంచి ఆలస్యంగా బయలుదేరాయని చెప్పుకొచ్చారు. అందువల్లే నిమజ్జన ప్రక్రియ ఆలస్యం అవుతోందని అన్నారు. ప్రస్తుతం నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని చెప్పారు. మరో 150 వినాయకుల విగ్రహాలు నిమజ్జనం అవుతాయని భావిస్తున్నామని అన్నారు. బషీర్‌భాగ్ లిబర్టీ వద్ద ట్రాఫిక్ సమస్యను గుర్తించామని చెప్పారు. తమ సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారని వెల్లడించారు. గత రెండు నెలల నుంచి ఓ ప్లాన్‌తో పనిచేశాం.. ఈరోజు ట్యాంక్‌బండ్ దగ్గర వెహికల్ బ్రేక్ డౌన్ అయిందని సజ్జనార్ చెప్పారు. గత రెండు నెలల నుంచి ఓ ప్లాన్‌తో పోలీసులు నిమజ్జన ప్రక్రియం కోసం పనిచేశారని అన్నారు. గణేశ్ ఉత్సవ కమిటీల ఆర్గనైజేషన్‌తో మాట్లాడి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడంతో ప్రశాంతంగా నిమజ్జనం ప్రక్రియ పూర్తి అవుతోందని అన్నారు. లంబోదరుడి నిమజ్జనాలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన హైదరాబాద్ పోలీస్ సిబ్బందిని పేరుపేరునా సీపీ సజ్జనార్ అభినందించారు.

## 'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'..

# రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్

- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శలు
- కాంగ్రెస్ లక్ష్యం గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తేవడమేనని ఆరోపణ
- రేవంత్ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పంచుకున్న భండారీ
- ఎమర్జెన్సీ, 1984 అల్లర్ల వంటి అంశాల ప్రస్తావన
- నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకుంటూ రేవంత్ వ్యాఖ్యలు



**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు ఈ రెండు పరివార్ల మధ్యేనని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను భండారీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. రేవంత్ 'గాంధీ పరివార్' కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. 'కాంగ్రెస్ లక్ష్యం అదే' అంటూ ఆరోపణరేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ లక్ష్యాన్ని బయటపెట్టాయని భండారీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం గాంధీ కుటుంబాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాల కంటే కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. గాంధీ-వాద్రా కుటుంబ పాలన అంటూ విమర్శలు గుప్పించిన భండారీ పలు చారిత్రక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, 26/11 ముంబయి ఉగ్రదాడుల సమయంలో భారత స్పందన వంటి అంశాలను ఆయన గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం, దేశ ఆర్థిక పరిస్థితి, పేదరికం వంటి అంశాలపైనా వ్యాఖ్యలు చేశారు. అసలు రేవంత్ ఏం అన్నారు'గాంధీ పరివార్', 'సంఘ్ పరివార్' మధ్య పోరు జరుగుతోందని అన్నారు. గాంధీ కుటుంబానికి చెందిన పలువురు దేశం కోసం త్యాగాలు చేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే తనకు మిగిలిన రాజకీయ లక్ష్యమని కూడా చెప్పారు.

## ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం నా ఫాంహౌస్

# కబ్జా భూమి కాదు



**హైదరాబాద్:** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్ప ష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరా యింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శ లున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తో ందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు.

## కాంగ్రెస్ పాలనపై

# ప్రజల్లో అసంతృప్తి



**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారుప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల..

# 70.07 శాతం ఉత్తీర్ణత




**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్-2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి

# ఐలమ్మ నిలువెత్తు రూపం

- చాకలి ఐలమ్మ 131వ జయంతి
- ఘన నివాళి అర్పించిన కేసీఆర్
- నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కేసీఆర్ కితాబు
- ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని వ్యాఖ్య



**హైదరాబాద్,** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు.

## దేవుళ్ల దగ్గర రాజకీయ నేతల పాటలు పెట్టడం సరికాదు



**జగిత్యాల, సెప్టెంబర్ 26 :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. దేవుళ్ల దగ్గర రాజకీయ నేతల పాటలు పెట్టడమెంటని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ విష సంస్కృతినే అని చెప్పారు. హైదరాబాద్ సంస్కృతి జగిత్యాలకు కూడా పాకిందని తెలిపారు. వినాయకుడి దగ్గర శివపార్వతుల పాటలు పెట్టాలని సూచించారు. కనీసం గణేశ్ వాహనం ఎలుక గురించి పాడిన అభ్యంతరం లేదని ఎమ్మెల్యే సంజయ్ చెప్పుకొచ్చారు. రాజకీయ నేతల పాటలు పెడితే పోలీసులు జోక్యం చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. దేవుడి పాటల విషయంలో రాజకీయాలు వద్దని చెప్పారు. 'నేను రేవంత్‌రెడ్డితో కలిసి పని చేస్తున్నా.. అంత మాత్రానా జై రేవంత్‌రెడ్డి' అని అనాల్సిన పని లేదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## మత్స్యకారులకు ఉచితంగా

# 50 కిలోల బియ్యం




**అమరావతి, సెప్టెంబర్ 26** రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో చేపట్టిన పునరావాస చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. వేటకు వెళ్లలేకపోయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. వరద జలాలను పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునేందుకు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజీకి ఎగువన బ్యారేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గతంలో చేసిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో వరద పరిస్థితులపై సీఎస్ సాయిప్రసాద్ సహా ఉన్నతాధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఐదు రోజులుగా సముద్రంలో వేటకు వెళ్లలేకపోయిన మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా 50 కిలోల బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

నీటిని రిజర్వాయర్‌లోకి తరలించాలి: ఉత్తరాంధ్రలో నదీ ప్రవాహాలు, ముంపు పరిస్థితిని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న పునరావాస చర్యలను అధికారులు సీఎంకు తెలిపారు. హిరమండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేసి, పనులు పూర్తి చేసి వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులను చంద్రబాబు ఆదేశించారు. వివిధ జిల్లాల్లో రిజర్వాయర్లను నింపేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.

# సోలార్ ఈపీసీ కంపెనీ ఆఫ్ ది ఇయర్‌గా శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్

**విశాఖపట్నం సెప్టెంబర్ 26**
ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ అవార్డ్స్--2026లో శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ (ాదీూజు) సంస్థ రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలను సొంతం చేసుకుంది. విశాఖపట్నంలోని గదిరాజు ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఫస్ట్ వ్యూ గ్రూప్ నిర్వహణలో, సోలార్ క్వార్టర్ ఆధ్వర్యంలో జరిగిన 2వ ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ ఎక్స్‌పో ఽ లీడర్‌షిప్ అవార్డ్స్--2026 కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రకటించారు.తెలుగు రాష్ట్రాల్లో నాణ్యమైన రెసిడెన్షియల్ రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినందుకు శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్‌కు "సోలార్ ఈపీసీ కంపెనీ ఆఫ్ ది ఇయర్: రెసిడెన్షియల్" అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని సంస్థ డైరెక్టర్ శ్రీ సాగర్ రెడ్డి అందుకున్నారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన'ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పథకం అమలులో అత్యుత్తమ సేవలు అందించినందుకు సంస్థకు "పీఎం సూర్య ఘర్ శక్తి" అవార్డు కూడా దక్కింది.రెండు ప్రతిష్టాత్మక అవార్డులు ఒకేసారి లభించడం పట్ల శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో మరింత విస్తృతంగా సేవలందిస్తూ, ప్రజలకు సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.







# ప్రపంచ బదిరుల దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి.









**వరంగల్ :** పూజ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర బదిరుల పాఠశాల, హనుమకొండ లోని వినికిడి లోపం గల విద్యార్థులకు హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మరియు మెడికవర్ హాస్పిటల్, హంటర్ రోడ్, వరంగల్ వారి సహకారంతో ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ గారు, వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి. రాజారెడ్డి, వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజమణి, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ, డా.అనిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.శిబిరంలోని డాక్టర్లు విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన మరియు సంబంధిత వైద్య సలహాలు అందించారు. వినికిడి లోపం గల విద్యార్థులకు సమాన ఆరోగ్య సేవలు, విద్యా అవకాశాలు, న్యాయ సహాయం మరియు వారి హక్కులపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే దివ్యాంగజన్ కౌశల్ వికాస్ ద్వారా దివ్యాంగులకు నైపుణ్య శిక్షణ, దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతోంది అని వాటి గురించి వివరించారు.

ఈ రెండు కార్యక్రమాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఆధారిత జీవనం వైపు ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "వినికిడి లోపం గల వ్యక్తులతో సమర్థవంతమైన సంభాషణకు సంకేత భాష (ప్రత్యేక భాష) కీలకమైన సాధనమని, అయితే సాధారణ ప్రజల్లో సంకేత భాషపై అవగాహన కల్పించుట కొరకు పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక సంకేత భాష బోధనకు జిల్లా విద్యా శాఖాధికారి సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.వినికిడి లోపం గల వ్యక్తులతో సాధారణ విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సమాజంలోని ఇతర వర్గాలు సులభంగా సంభాషించగలిగేలా ప్రాథమిక సంకేత భాషపై అవగాహన కల్పించడం ద్వారా సమగ్ర సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.వినికిడి లోపం ఒక అడ్డంకి కాకుండా, ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు మరియు గౌరవంతో జీవించే హక్కు ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ వైద్య శిబిరంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు మెడికవర్ హాస్పిటల్, హంటర్ రోడ్ వారి సహకారంతో ఈ.ఎన్.టి., ఆడియోమెట్రి, కంటి సంబంధ, మధుమేహ, జనరల్ ఫిజిషియన్, దంత, రక్త సంబంధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు సంబంధిత మందులు అందించడం జరిగింది.

**--- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్.**

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 26**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కాంట్రాక్టు కార్మికుల హక్కులను తీవ్రంగా కాలరాస్తున్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు.

రామగుండం ఎన్టీపీసీ ఐఎఫ్టీయూ (×ఖీుఖ) కార్యాలయంలో నిర్వహించిన ఎన్టీపీసీ సోలార్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నూతన నిర్మాణ జనరల్ బాడీ సమావేశానికి ఐఎఫ్టీయూ నాయకుడు ఎండీ సాదిక్ అధ్యక్షత వహించగా, చిలుక శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలతో కూడుకున్నవని విమర్శించారు. వీటి వల్ల కార్మికులకు ఉన్న సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె హక్కులకు విఘాతం కలగడమే కాకుండా, పని గంటలను పెంచేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పించారని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కాంట్రాక్టు కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకతలో రామగుండం ఎన్టీపీసీ దేశంలోనే ప్రముఖ సంస్థగా నిలిచి అనేక అవార్డులు అందుకంటున్నప్పటికీ, ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పరిస్థితులు మాత్రం దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో సుమారు 350 మంది శాశ్వత కార్మికులు ఉంటే, 4 వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. శాశ్వత కార్మికులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక:సమావేశం అనంతరం ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడు: ఎండీ సాదిక్,ఉపాధ్యక్షుడు: జి. సురేష్,ప్రధాన కార్యదర్శి: ఎం. రమేష్,సహాయ కార్యదర్శి: సాజిత్,కోశాధికారి: సీహెచ్. శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు: ఎం. సతీష్, ఆర్. శివ, పి. సంతోష్, ఏ. రాజు, గణేష్, వి. రమేష్, ఎస్డీ. సమీర్, ఎండీ. సాజిద్.ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే. రాజన్న, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ. నరేష్, జిల్లా నాయకులు తోకల రమేష్, ఐ. రాజేశం, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మకు ఘన నివాళి



**హనుమకొండ:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీరవనిత చిట్యాల ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకొని 49వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగపురి కరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి ఆమెకు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చేసిన పోరాటం, ధైర్యసాహసాలను నాయకులు స్మరించుకున్నారు. పేదలు, రైతులు, మహిళల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సాంబరాజు కిరణ్,యాదగిరి,రాములు,కుమార్ మరియు పాల్గొన్నారు.

# కాట్రపల్లి శివకోటేశ్వర ఆలయ నిర్మాణంలో అవినీతి జరగకుండా చర్యలు తీసుకోవాలి

### ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్



**వరంగల్, సెప్టెంబర్ 26:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామంలోని చారిత్రక శివకోటేశ్వర ఆలయ నిర్మాణ పనుల్లో అవకతవకలు, అవినీతి జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు.భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) ఆధ్వర్యంలో వరంగల్ ఎండోమెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నుంచి కాట్రపల్లి గ్రామంలో శివకోటేశ్వర ఆలయం ఉందని, ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు.

ఆలయ నిర్మాణంలో నాణ్యత లోపించకుండా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఆలయ చైర్మన్‌ను చట్టబద్ధంగా నియమించాలని, ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదల చేసిన రూ.4.60 కోట్ల నిధులను పూర్తిగా ఆలయ నిర్మాణానికే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిర్మాణ పనులను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తూ పారదర్శకత పాటించాలని, నిధుల దుర్వినియోగం జరగకుండా ప్రభుత్వం, ఎండోమెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గడ్డం నాగార్జున కోరారు.

# లాన్ టెన్నిస్‌లో ప్రతిభను పెంపొందించుకోవాలి

### -- వరంగల్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం వెంకటేశ్వర్లు



**హనుమకొండ, సెప్టెంబర్ 26 (సుదీక్ష న్యూస్):** విద్యార్థులు లాన్ టెన్నిస్‌లో ప్రతిభను పెంపొందించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని వరంగల్ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు, లాన్ టెన్నిస్ పోటీల కన్వీనర్ మన్నం వెంకటేశ్వర్లు అన్నారు.హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాఠశాలల అండర్--14, అండర్--17 బాలబాలికల లాన్ టెన్నిస్ సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు, నిరంతరం సాధన చేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు.ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించేందుకు పీఈటీలు కృషి చేయాలని ఆయన కోరారు. సెలెక్షన్స్‌లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ పాఠశాలల క్రీడల కార్యదర్శి పుల్ల అనిల్ కుమార్, పీడీలు జన్ను బాబు, వెంకటేశం, పాషా, సమ్మయ్య, సలార్, పాక శ్రీనివాస్, రఘువీర్, కరిత, హేమలత, స్వరూప, మల్లయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# గట్టు మహేష్ బాబుకు 'కళాబంధు' గౌరవ బిరుదు



**హనుమకొండ:** కాకతీయ కళావైభవం అంతర్జాతీయ సాంస్కృతిక కళా మహోత్సవంలో భాగంగా వరంగల్ ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు గట్టు మహేష్ బాబును 'కళాబంధు' గౌరవ బిరుదుతో సత్కరించనున్నారు. ఈ రోజు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డు సాహస మహోత్సవ సమ్రాట్ శ్రీ శాంతికృష్ణ సేవా సమితి 41వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'కాకతీయ కళావైభవం' పేరుతో అంతర్జాతీయ సాంస్కృతిక కళా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.గట్టు మహేశ్ బాబుతో పాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# గణేష్ లడ్డును మాజీ మంత్రి ఎర్రబెల్లికి బహుమతిగా అందజేత..



**జనగామ జిల్లా:**
దేవరుప్పుల మండలం,కోలుకొండ గ్రామంలో శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గెలుపును కోరుతూ జిల్లా యువజన నాయకుడు కోతి ప్రవీణ్ గౌడ్,గ్రామ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,మహిళ నాయకులు,యూత్ నాయకులు,కార్యకర్తల సమక్షంలో మహాగణపతి చేతిలోని నవరాత్రి పూజలు అందుకున్న లడ్డును 18,516 రూపాయలకు కైవసం చేసుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుఽఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,ఎర్రబెల్లి ఉష దయాకర్ రావుకు బహుమతిగా అందజేయునట్లు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ గ్రామ బీఆర్ఎస్ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో భాషాభిమానాన్ని పెంపొందించడమే లక్ష్యం:చింత ప్రసాద్

**జనగామ జిల్లా:** తెలుగు భాషపై మమకారాన్ని పెంపొందిస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మక రచనా శక్తిని వెలికితీయాలనే సంకల్పంతో దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సౌదామని సాహిత్య సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు.సౌదామని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింత ప్రసాద్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు 'ఆధునిక కాలంలో తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు'అనే అంశంపై పోటీలు నిర్వహించారు.ఈ వ్యాసరచన పోటీలకు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాతృభాషపై తమకున్న అభిమానాన్ని అక్షర రూపంలో ఆవిష్కరిస్తూ విద్యార్థులు చక్కటి వ్యాసాలను రచించారు. తెలుగు భాష వైభవం, సాహిత్య పరిమళం, ఆధునిక సమాజంలో మాతృభాష ప్రాధాన్యత, భాషాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను తమ రచనల్లో ప్రతిబింబించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలను అందజేశారు.ప్రథమ బహుమతి: దేవరుప్పుల శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ 10వ తరగతి విద్యార్థిని ముత్యం సాత్విక. ద్వితీయ బహుమతి: దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని భౌరోజు సాత్విక.



తృతీయ బహుమతి: దేవరుప్పుల శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ 10వ తరగతి విద్యార్థి చింతకింది హనీష్ విజేతలుగా నిలిచారు.ఈ సందర్భంగా అతిథులు, కవులు, కళాకారులు, రచయితలు, గాయకులు మాట్లాడుతూ తెలుగు భాష కేవలం సంభాషణకు మాత్రమే పరిమితమైనది కాదని,అది తరతరాల సంస్కృతికి, సంప్రదాయాలకు, సాహిత్య వైభవానికి ప్రతీక అని,విద్యార్థులు మాతృభాషను ప్రేమించి, చదవడం, రాయడం, సృజనాత్మకంగా వ్యక్తీకరించడం ద్వారా తెలుగు భాషను భావితరాలకు మరింత బలంగా అందించాలని సూచించారు.'అక్షరం ఆలోచనకు ఆయువు..భాష భావానికి బలం..తెలుగు మన సంస్కృతికి చిరునామా'అనే సందేశంతో విద్యార్థుల్లో భాషాభిమానాన్ని, సాహిత్యాసక్తిని పెంపొందించే కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. అనంతరం సౌదామని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింత ప్రసాద్ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు,ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు, నిర్వాహకులకు, విద్యార్థులకు పేరుపేరునా కృతజ్ఞతలు, అభివందనాలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి, తెలుగు భాషా సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేందుకు సౌదామని సాహిత్య సంస్థ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్,ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ సౌదామని సాహిత్య సంస్థ ఉపాధ్యక్షులు అంకాల సోమయ్య,జనగామ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు నక్క సురేష్, పోతన సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మాన్యపు విజేందర్,అయిలా సోమనరసింహచారి, అభినందన కల్చరల్ సొసైటీ పెంబర్తి జనగామ జిల్లా,చిన్నమడూర్ బీసీ హాస్టల్ వార్డెన్ బోనగిరి పూర్ణచందర్, కళాశాల అధ్యాపకులు అనంతచారి,శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సంస్థ ప్రధాన కార్యదర్శి జోగు సుదర్శన్, జోగు మధు,మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కుబీర్ మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రేడింగ్ ప్రమాణాలపై శిక్షణ



**ముధోల్ (కుబీర్), సెప్టెంబర్ 26**
కుబీర్‌లోని మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), గ్రామ సంఘాలు (వీఓ), మండల సమాఖ్య (ఎంఎస్) కార్యవర్గ సభ్యులకు సంఘాల పనితీరు, గ్రేడింగ్ ప్రమాణాలపై శనివారం ఒక రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శిక్షణా కార్యక్రమానికి ఓరగల్లు మహా సమాఖ్య ప్రతినిధులు, సీనియర్ సీఆర్పీలు డి. శోభారాణి, బి. పుష్పలత హాజరై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంఘాల పనితీరును మెరుగుపరచడం, రికార్డులను పక్కాగా నిర్వహించడం, గ్రేడింగ్ విధానాలపై సభ్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.సెర్ప్ నిబంధనల ప్రకారం స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్‌కు ప్రత్యేక విధానాలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని అధికారిక నివేదికలను ఉటంకిస్తూ వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# గజ్వేల్ లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ.

**గజ్వేల్** ఈ కార్యక్రమంలో హరీష్ రావు గారు మాట్లాడుతూ:
ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం పెత్తందారుల మీద పోరాటం చేసి, పీడిత ప్రజల పక్షాన నిలిచిన వీరవనిత చాకలి ఐలమ్మ.
అలాంటి వీరవనితకు సమైక్య రాష్ట్రంలో సరైన గుర్తింపు దక్కలేదు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గౌరవ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆమె జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది.
దాంట్లో భాగంగానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా చాకలి ఐలమ్మ జయంతిని జిల్లా కలెక్టర్లు, మంత్రులు, అందరూ అధికారికంగా నిర్వహిస్తూ, ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, పేదల పక్షాన ఆమె చేసిన పోరాటాన్ని మనందరం స్మరించుక ంటున్నాం.నిజంగా ఐలమ్మ ఆ రోజుల్లో గడీల మీద చేసిన పోరాటం చాలా గొప్పది. రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తే.. ఆ పంటలకు గిట్టుబాటు ధర రాక పోడవటంతో పోరాటం చేసింది. రాష్ట్రంలోనే విశిష్ట స్థానం మన గజ్వేల్‌ది. బహుశా తెలంగాణలో ఎక్కడా లేని విధంగా మీకు బ్రహ్మాండమైన స్థలాన్ని ఇచ్చి, కోటి రూపాయలతో చాకలి ఐలమ్మ భవనాన్ని కట్టించారు మన కేసీఆర్ గారు. రాష్ట్రంలో ఎక్కడా లేనటువంటి చాకలి ఐలమ్మ భవన్ ఎక్కడ ఉందంటే మన గజ్వేల్‌లో ఉంది. దాన్ని మన కేసీఆర్ గారు మనకు నిర్మించి ఇచ్చారు.
ఈ విగ్రహాన్ని కూడా చక్కగా పాండవుల చెరువు ఎదురుగా ఏర్పాటు చేశారు. ఇంత మంచి ప్రదేశంలో ఒకవైపు పాండవుల చెరువు, ఒకవైపు మడేలమ్మ గుడి మరోవైపు చాకలి ఐలమ్మ విగ్రహం. ఇలా మంచి లొకేషన్‌లో ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను, మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.మా కౌన్సిలర్ నర్సింహారావు, పద్మాబాయి కూడా మంచి చొరవ చూపి దీని కోసం ఎంతో కృషి చేశారు. వారిని కూడా నేను అభినందిస్తున్నాను.ఈరోజు ఏం జరుగుతుందో మీ అందరికీ తెలుసు. గజ్వేల్‌లో పరిస్థితి ఏమైందంటే, కేసీఆర్ గారు వేసిన రోడ్లకు ఏదైనా గుంతలు పడితే కనీసం తారు పోసే పరిస్థితి



కూడా కనిపించడం లేదు. కేసీఆర్ గారు కట్టించిన బిల్డింగులకు కనీసం సున్నం వేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు.కేసీఆర్ గారు వంద పడకల మహిళా, శిశు సంక్షేమ ఆసుపత్రిని కట్టిస్తే, ఆ దవాఖానను ఇప్పటిదాకా ఉపయోగంలోకి కూడా తీసుకురాని పరిస్థితిని మనం చూస్తున్నాం.ఈరోజు కాళేశ్వరం మోటర్లు నడిపిస్తే, మల్లన్నసాగర్ నింపుకుంటే అద్భుతంగా నీళ్లు వస్తున్నాయి. నిజంగా పాండవుల చెరువు ఒకప్పుడు ఎండిపోయి ఉండేది. అటువంటి పాండవుల చెరువు ఈరోజు అద్భుతంగా కాళేశ్వరం నీళ్లతో కళకళలాడుతోంది.బతుకమ్మ పండుగ వస్తే ఇక్కడ నీళ్లు లేక, ట్రాక్టర్లతో నీళ్లు తెచ్చి గుంత నింపి బతుకమ్మలు వేసిన రోజులు ఉన్నాయి. అటువంటి పాండవుల చెరువు ఈరోజు కాళేశ్వరం జలాలతో కళకళలాడుతూ, నిండు నీళ్లతో నిండు కుండలా ఉండడం నిజంగా చాలా సంతోషంగా అనిపిస్తోంది.గజ్వేల్ రూపురేఖలు మారాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ కావడంతో ఎంతో అభివృద్ధి జరిగింది. రైల్వే స్టేషన్ రావడం కావచ్చు, రైలు రావడం కావచ్చు, గోదావరి జలాలు రావడం కావచ్చు, ఆసుపత్రులు రావడం కావచ్చు ఎన్నో మంచి కార్యక్రమాలు జరిగాయి. ఇంకా జరగాల్సిన ం కూడా ఉంది.
ఈరోజు చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మా రజక సోదర సోదరీమణులకు, ఈ గ్రామ పెద్దలకు, మీ అందరికీ ఈ సందర్భంగా మరోసారి శు భాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నాను.చాకలి ఐలమ్మ మనకు స్ఫూర్తిగా నిలవాలి. ఐలమ్మ విగ్రహం పెట్టుకోవడం మాత్రమే కాదు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు జరిగితే, ఏ ప్రభుత్వమైనా, ఏ పాలకులైనా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే, ఐలమ్మ స్ఫూర్తితో మనం పోరాటం చేయాలి. ఆ ప్రభుత్వం మీద, ఆ పాలకుల మీద, అన్యాయం చేసిన వాళ్ల మీద పోరాడి పేదల పక్షాన, పీడిత ప్రజల పక్షాన మనం నిలబడాలి. అదే ఐలమ్మ మనకు ఇచ్చిన స్ఫూర్తి.ప్రశ్నించకపోతే ఎవరూ పట్టించుకోరు. మన ఐలమ్మ కొంగు నడుముకు చుట్టి, తుపాకులకు వ్యతిరేకంగా, ఫిరంగి గుళ్లకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడింది. పేదల హక్కుల కోసం పోరాడింది. పేదల గొంతుకగా ఉద్యమించింది.కాబట్టి మనం కూడా ఆమె నుంచి తీసుకోవాల్సిన స్ఫూర్తి ఏమిటంటే ఎవరైనా మనకు అన్యాయం చేస్తే, మనకు తప్పు చేస్తే, అటువంటి వాళ్ల మీద పోరాటానికి సమాయాత్తం కావాలి. అదే చాకలి ఐలమ్మ మనకు ఇచ్చిన స్ఫూర్తి.దాన్ని మనం అందిపుచ్చుకోవాలి. ఎవరు మనకు అన్యాయం చేసినా, ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి. మన హక్కులను కాపాడుకోవాలి అని ఈ సందర్భంగా మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

# నిర్మల్‌లో భూసమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**పెండింగ్ భూభారతి దరఖాస్తులను వెంటనే తేల్చేయాలని కలెక్టర్ ఆదేశాలు**




**ముధోల్ (నిర్మల్),సెప్టెంబర్ 26:** జిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను నిబంధనల ప్రకారం యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను గట్టిగా ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ,సర్వే శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన"భూభారతి దరఖాస్తుల పరిష్కారం – రీ–సర్వే ప్రక్రియ"పై ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మండలాల వారీగా క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ఏ ఏ మండలాల్లో ఎక్కువ ఫైళ్లు నిలిచిపోయాయో వాటిపై ప్రత్యేక నివేదికను అడిగి తెలుసుకున్నారు.నిర్దేశిత గడువు ముగిసినా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ,విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిధంగా జిల్లాలో జరుగుతున్న డిజిటల్ రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సరిహద్దు వివాదాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని సూచించారు. రైతులు మరియు భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా ఈ ప్రక్రియ సాగాలని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మండలాల వారీగా తానే స్వయంగా ప్రగతిని సమీక్షిస్తానని,అధికారులు లక్ష్యాలను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి (ఇ=చా), సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు (ూణ),అన్ని మండలాల తహసీల్దార్లు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ కసరత్తు

**- ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కేటీఆర్**
**- ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు**



**హైదరాబాద్:** రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఎన్నికలకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆరు జిల్లాల నేతలతో దశలవారీగా సమావేశమవుతున్న ఆయన.. ఇందులో భాగంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను మోసం చేసిందన్న ఆగ్రహం వారిలో తీవ్రంగా ఉన్నదని కేటీఆర్ అన్నారు. చదువుకున్నవారు తమ సమస్యలతోపాటు తమ కుటుంబాలు, అన్నదాతలు, మహిళలు, యువత సహా రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలను గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ద్రోహం చేసిందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని అన్నారు. అయితే ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటుగా మారేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో



భాగంగా మరో రెండు రోజుల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నేతలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. ఆయా జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయి ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసేలా బాధ్యతలు, కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈసారి పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అభ్యర్థి ఎవరైనా ఎన్నిక పార్టీ గుర్తుపైనే జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 'వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక' పై శిక్షణా కార్యక్రమం



**ముధోల్(కుభీర్),సెప్టెంబర్ 26**
కుబీర్ మండల కేంద్రంలోని ప్రజాపరి షత్ కార్యాలయంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ) రూపకల్పనపై శనివారం అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో భీమారావు,ఎంపీఓ భీమేష్, ఏపీఓ హరిలాల్ మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై విస్తృతంగా వివరించారు. ప్రజల కనీస అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి,వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికల్లో చేర్చే విధానాన్ని ప్రజాపతినిధులకు క్షుణ్ణంగా వివరించారు.స్థానిక అవసరాలకు తగ్గట్టుగా నిధులను ఎలా వినియోగించుకోవాలో సూచించారు.

# అ'ధర'హో : బాలాపూర్ నుంచి శంకర్‌పల్లి దాకా - ఈసారి భారీ ధర పలికిన లడ్డూలు ఇవే!



**హైదరాబాద్ :** గణేశ్ నవరాత్రుల సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల నిర్వహించిన లడ్డూ వేలంలో గణపయ్య లడ్డూలు అంచనాలను మించి ధర పలికాయి. బాలాపూర్?తో పాటు వివిధ ప్రాంతాల్లో వినాయక లడ్డూ వేలం పాటలు సందడిగా సాగాయి. పలువురు భక్తులు నువ్వా-నేనా అన్నట్లు పోటీ పడి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పాటలో గణనాథుని లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకొని సంబురాల్లో మునిగిపోయారు. లడ్డూ ప్రసాదం దక్కితే ఇక సిరిసంపదలకు లోటు లేదంటూ పొంగిపోయారు. రాష్ట్రంలోని పలుచోట్ల నిర్వహించిన వేలం పాటల్లో లడ్డూలు రికార్డు ధర పలికాయి. ఆ విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.కీర్తి రిచ్?మండ్?లో రూ.1.01 కోట్ల పలికిన లడ్డూరంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్‌లోని గణేశ్? మండపంలో గణనాథుడి లడ్డూ వేలం మరోసారి రికార్డు ధర పలికింది. ఈ నెల 22న నిర్వహించిన లడ్డూ వేలంలో అదే కమ్యూనిటీకి చెందిన శక్తిమాన్ బృంద సభ్యులు ఏకంగా రూ.1.01 కోట్లకు కైవసం చేసుకున్నారు. కీర్తి రిచ్?మండ్ విల్లాస్‌లో 2016లో మొదటగా లడ్డూ వేలం మొదలైంది. అనంతరం నాలుగేళ్లుగా రికార్డు స్థాయిలో లడ్డూ వేలం కొనసాగుతుండగా, ఈ ఏడాదీ అదే రిపీట్ అయ్యింది. గత ఏడాది ఈ కమ్యూనిటీలోని లడ్డూ రూ.2.31 కోట్లు పలికిన విషయం విధితమే. ప్రతి ఏడాది కమ్యూనిటీకి చెందిన వారంతా 4 గ్రూపులుగా విడిపోయి వేలం పాటలో పాల్గొంటున్నారు.బాలాపూర్ లడ్డూ 'ధర'హాసం

ఏటేటా భక్తుల్లో అంచనాలను పెంచుతూ దేశ విదేశాల్లోని తెలుగు వారిని ఆకర్షించే బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట, ఈ ఏడాది మరింత రసవత్తరంగా సాగింది. ఈసారి నిర్వహించిన వేలం పాటలో రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది. ఈసారి వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి అనే వ్యక్తి గణేశుడి లడ్డూను దక్కించుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, చివరికి ప్రణీత్ రెడ్డిని అదృష్టం వరించింది.కొంపల్లిలో రూ.30.60 లక్షలుప్రసిద్ధ బాలాపూర్ గణపతి లడ్డూ తర్వాత అత్యధిక ధర పలికిన కొంపల్లిలోని పామ్ మెడోస్ విల్లాస్‌లోని గణేశ్ లడ్డూనూ రూ.30.60 లక్షలకు ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోనూ లడ్డూ భారీ ధర పలికింది. లంబోదరుడి లడ్డూను రూ.28 లక్షల 11 వేలకు బండారి శ్రీనివాస్ రెడ్డి దక్కించుకున్నారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలంలో తుదివరకు ఏ మాత్రం తగ్గకుండా శ్రీనివాస్ రెడ్డి కైవసం చేసుకున్నారు.సంగారెడ్డిలో రూ.21 లక్షలు పలికిన లడ్డూసంగారెడ్డి చైతన్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో రూ.21 లక్షలకు కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి కుటుంబసభ్యులు లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో పాల్గొని పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా, సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల పక్షాన లడ్డూ పాట పాడినట్లు జగ్గారెడ్డి వర్గీయులు పేర్కొన్నారు.అత్తాపూర్? గణేశుడి లడ్డూ రూ.13 లక్షలుఅత్తాపూర్‌లో గణేశ్ లడ్డూ వేలం హోరాహోరీగా సాగింది. ఓల్డ్ పోచమ్మ ఆలయం వద్ద నవశక్తి భక్త సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ ఉత్సవాల్లో గుమ్మడి బ్రదర్స్‌కు చెందిన భూపాల్ రెడ్డి రూ.13 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.ఇక్కడా అ'ధర'హోహైదరాబాద్‌లోని హస్తినాపురంలోని అగ్రికల్చర్ కాలనీలో రూ.16.02 లక్షలకు శివనాగేశ్వరరావు అనే భక్తుడు లడ్డూ సొంతం చేసుకున్నాడు. మూసాపేట సేవాలాల్‌నగర్‌లో లడ్డూ రూ.11.50 లక్షలు పలకగా, శంకర్ ?నాయక్? దక్కించుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి సింగాపురంలో గణనాథుడి లడ్డూను రూ.5.22 లక్షలకు జనార్దన్ రెడ్డి సొంతం చేసుకున్నారు.

# దేవుళ్ల దగ్గర రాజకీయ నేతల పాటలు పెట్టడం సరికాదు: ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల, సెప్టెంబర్ 26 :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. దేవుళ్ల దగ్గర రాజకీయ నేతల పాటలు పెట్టడమేంటని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ విష సంస్కృతినే అని ధ్వజమెత్తారు. హైదరాబాద్ సంస్కృతి జగిత్యాలకు కూడా పాకిందని తెలిపారు. వినాయకుడి దగ్గర పార్వతి, శివుడి పాటలు పెట్టాలని అన్నారు.కనీసం గణేశ్ వాహనం ఎలుక గురించి పాడిన అభ్యంతరం లేదని ఎమ్మెల్యే సంజయ్ చెప్పుకొచ్చారు. రాజకీయ నేతల పాటలు పెడితే పోలీసులు జోక్యం చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. దేవుడి పాటల విషయంలో రాజకీయాలు వద్దని చెప్పారు. 'నేను రేవంత్‌రెడ్డితో కలిసి పని చేస్తున్నా.. అంత మాత్రానా జై రేవంత్‌రెడ్డి' అని అనాల్సిన పని లేదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# గణేశ్ నిమజ్జనం సక్సెస్.. పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాం గం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది.మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

# తెలంగాణలో డిగ్రీ విద్యకు గడ్డుకాలం.. ఐదేళ్లలో 335 కాలేజీల క్లోజ్!




**హైదరాబాద్ :** ఈ ఏడాది 56 కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కాని వైనం ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడమే కారణమంటున్న యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,000 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆరోపణ వరుసగా మూడేళ్లు 25 శాతం సీట్లయినా నిండకపోతే కాలేజీలు మూతపడే ప్రమాదం తెలంగాణలో ప్రైవేటు డిగ్రీ విద్య తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. విద్యార్థుల నుంచి ఆదరణ తగ్గడం, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో ఏటా పదుల సంఖ్యలో కాలేజీలు మూతపడుతున్నాయి. గత ఐదేళ్ల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 335 ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు తాళాలు పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2021లో 1,100గా ఉన్న మొత్తం డిగ్రీ కాలేజీల సంఖ్య, ప్రస్తుతం 783కి పడిపోయింది.తాజాగా ముగిసిన మూడు విడతల 'దోస్త్' కౌన్సెలింగ్ తర్వాత కూడా సగానికి పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది 9 జిల్లాల పరిధిలోని 56 కాలేజీల్లో మొత్తం 16,460 సీట్లు ఉండగా, ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కాలేదు. నిబంధనల ప్రకారం, వరుసగా మూడేళ్లపాటు 25 శాతం సీట్లు భర్తీ కాని కాలేజీల గుర్తింపును రద్దు చేస్తారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో మరో 50కి పైగా కాలేజీలు మూతపడే ప్రమాదం ఏర్పడింది. ఒకప్పుడు నల్గొండ జిల్లాలో ప్రముఖంగా ఉన్న 4 దశాబ్దాల చరిత్ర గల నీలగిరి డిగ్రీ కాలేజీ సైతం గతేడాది మూతపడింది.ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం ఆరోపిస్తోంది. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు ఇస్తున్న ప్రాధాన్యం డిగ్రీకి ఇవ్వడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద తమకు దాదాపు రూ.2,000 కోట్లు రావాల్సి ఉందని సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతోనే కాలేజీలను మూసివేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గురువారం నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో, విద్యార్థులు నేరుగా కాలేజీల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

# రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్





**హైదరాబాద్ :** రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు

హామీలు అమలు కాలేదని ఆరోపణ

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా

సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు.తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తా మని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చ లేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

# సభలో మంత్రి పొంగులేటిని నిలదీసిన మహిళలు



**జనగామ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కి జనగామ జిల్లా కేంద్రంలో మహిళల నుంచి నిరసన వ్యక్తమయ్యింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేస్తలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం జనగామ ప్రెస్టన్ కాలేజ్ గ్రౌండ్ లో నిర్వహించిన సభలో మాట్లాడుతుండగా ఇందిరమ్మ చీరలు కట్టుకున్న మహిళలు ప్రసంగానికి అడ్డుపడ్డారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్దే తప్ప తమ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏం లేదని నిలదీశారు. పెన్షన్ 4 వేలు చేస్తానని చెప్పిండ్రు కదా. ఏది అంటూ మంత్రిని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ వాళ్లకే ఇచ్చుకున్నారు. నిజమైన పేదవాళ్లకు ఎవరికి ఇచ్చిండ్రో చూపియ్యండి అంటూ మంత్రిని నిలదీశారు. అన్ని దొంగ మాటలు చెప్తున్నారు. అంటూ మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రూ. 500 లకే గ్యాస్ అన్నారు. ఇప్పుడు వెయ్యి రూపాయలు చేసిండ్రు. 500 కు గ్యాస్ ఎవరికి ఇస్తున్నారో చూపించాలని డిమాండ్ చేశారు. మహిళలు నిలదీస్తుండగా అడ్డుకున్న పోలీసుల పైనా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలి'



**చండూరు, సెప్టెంబర్ 26 :** చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలని చాకలి ఐలమ్మ సంఘం తెలంగాణ ఫౌండర్ చైర్మన్ నాగిళ్ల శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్బండ వర్గాల మేల్కొల్పు గాత్రం, తెలంగాణ తల్లి వీరనారి, రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి చండూరు పట్టణ కేంద్రంలో పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ ట్యాంకుబండ్ పై ఐలమ్మ వంద అడుగుల విగ్రహాన్ని పెట్టాలన్నారు. రాబోయే రోజుల్లో చాకలి ఐలమ్మ చిత్రాలు పంచడం, ప్రతిమలు ఇవ్వడం, ఐలమ్మ పురస్కారాలు, అవార్డులు ఇవ్వడం జరుగుతూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, భూతరాజు దేవదాసు, ఐతరాజు మల్లేష్, భూతరాజు శ్రీహరి, భూతరాజు నరేష్, భూతరాజు యాదగిరి, భూతరాజు పాండు, భూతరాజు వెంకన్న, భూతరాజు శేఖర్, నలపరాజు శంకర్, కొండమీది లవకుమార్, ఏలే చంద్రశేఖర్ జన్ను, గంగిశెట్టి ప్రకాష్, జాంగిర్ పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రుల్లో రోగుల కష్టాలు - రాత్రుల్లో చుక్కలు చూపిస్తున్న వైద్యులు



**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన ఓ గర్భిణికి అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో వెంటనే నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఆమెను అత్యవసర విభాగంలో చేర్చారు. నొప్పులతో అవస్థలు పడుతోందని ఆమె కుటుంబ సభ్యులు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అయితే సమాచారమిచ్చి 45 నిమిషాలు గడుస్తున్నా, వారి నుంచి ఎలాంటి స్పందనా లేదు. అక్కడి వైద్య సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆమెను దగ్గరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది తక్షణం స్పందించింది. వెంటనే చికిత్స చేయడంతో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. నిలోఫర్‌లోనే ఉంచితే ఆమె పరిస్థితి ఏమయ్యేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.రోగులకు చుక్కలు చూపిస్తున్న వైద్యులు ఈ తరహాలోనే తాజాగా నిమ్స్ ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేరిన ఓ రోగికి సేవలందించడంలో ఆలస్యం చేశారు. దీంతో రోగి కుటుంబసభ్యులు వైద్యులను నిలదీశారు. అది వివాదంగా మారి చివరకు పోలీసుల కేసు వరకు వెళ్లింది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, పేట్లబుర్జు తరతర ఆస్పత్రుల్లో అర్ధరాత్రి సమయాల్లో వైద్య సేవలు అవసరమైతే రోగులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సరైన సమయానికి చికిత్స అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి.అందుబాటులో ఉండని సీనియర్ వైద్యులు సాధారణంగా రాత్రి వేళలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో సేవలందించాల్సి ఉంటుంది. అయితే పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీనియర్లపైనే ఈ భారం పడుతోంది. సీనియర్ వైద్యులు జూనియర్లకు ఈ బాధ్యతలప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ కారణంగా పీజీలు, రెసిడెంట్ వైద్యులపై ఈ పని భారం పడుతోంది. ఈ నేపథ్యంలోనే కొన్నిసార్లు వైద్య సేవల్లో ఏమాత్రం జాప్యం జరిగినా రోగుల కుటుంబీకులు వైద్య సిబ్బందితో వాగ్వా దాలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలోనే పలు ఆస్పత్రుల్లో గొడవలు జరుగుతున్నా యి. ఇలాంటి సమయాల్లో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉంటే సర్దుబా టు చేసే వీలుంటుంది. ఓ వైపు పని ఒత్తిడి, మరోవైపు ఈ తరహా గొడవల కారణంగా విధుల్లో ఉన్న పీజీలు, రెసిడెంట్లు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రభావం రోగుల సేవలపై పడుతోంది. ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది, వైద్యుల విధులను పర్యవేక్షించాల్సిన ఆర్ఎంవోలు చాలా మంది సమర్థంగా పని చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా రాత్రి పూట అత్యవసర విభాగాలు, వార్డులలో పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి అనే సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆపై వారు తగిన చర్యలు తీసుకొని పరిష్కరిస్తారు. అయితే కొందరు రాత్రి 10 గంటలు దాటితే వారి గదుల నుంచి బయటకు రావడం లేదనే విమర్శలూ ఉన్నాయి.చిన్న చిన్న కారణాలతో ప్రాణాలు పోతున్నా

హైదరాబాద్‌లోని పెద్దాసుపత్రులకు రాత్రి సమయాల్లో దాదాపుగా 20 నుంచి 30 వరకు అత్యవసర కేసులు వస్తుంటాయి. రాజధానికి చుట్టుపక్కల జరిగే ప్రమాదాలు, నలువైపుల ఉన్న జిల్లాల నుంచి ఎమర్జెన్సీ కేసులు ఈ ఆస్పత్రులకు రిఫర్ చేస్తుంటారు. ఇలాంటి కేసుల్లో గోల్డెన్ అవర్ (తొలి గంట)లోనే చికిత్సలు అందించాల్సి ఉంటుంది. సేవల్లో జాప్యం, వెంటిలేటర్లు లేకపోవడం వంటి చిన్న చిన్న కారణాల వల్ల కొన్నిసార్లు అంబులెన్సు లోనే రోగులు ప్రాణాలు విడుస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

Printed, Published & Owned by Rachakonda Printers & Publication's at P. Mahesh Goud Office address :-Dwaraka nagarRoad no:6 Plot : 101500079 RR dist, Hyderabad TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H. No:- 5-2-396 Venkateshwara colony Saheb nagar Rangareddy 500070 TELANGANA STATE. EDITOR : P. Mahesh Goud 9908 502 602 , PRGI NO:- TGTEL/26/A6429. EMAIL: youvavelugu@gmail.com https://epaper.yuvavelugu.com